ANDHRA JYOTHI

15 APR 2020

# యానాంలో భద్రత మరింత కట్టుదిట్టం

**» నేటి నుంచి ఇంటింటికీ బియ్యం పంపిణీ » పరిపాలనాధికారి శివరాజ్‌మీనా**

యానాం, ఏప్రిల్ 14: కేంద్ర ప్రభుత్వంతో పాటు పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్ పొడిగించడంతో యానాం సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టుల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని పరిపాలనాధికారి శివరాజ్‌మీనా పేర్కొన్నారు. కొందరు అనవసరంగా రోడ్లపై తిరుగుతున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ నిత్యావసరాల కొనుగోలుకు బయటకు రావద్దని సూచించారు. ఇప్పటివరకు ప్రజలు మంచి సహకారం అందించారని, రానున్న ముడు వారాలు మరింత సహకారం అందించాలన్నారు. ఇప్పటివరకు యానాంలో పాజిటివ్ నమోదు కాలేదని, క్వారంటైన్ చేసిన వారి రక్త నమూనాలను పరీక్షించగా ఎటువంటి పాజిటివ్ రాలేదని అన్నారు. ఆరోగ్యానికి సంబంధించి ఎటువంటి సందేహాలున్నా ఆసుపత్రికి రాకుండా సూచించిన సమయాల్లో డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి సలహాలు తీసుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అవసరమైతే ఆసుపత్రికి వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో వైద్యుల ఫోన్ నెంబర్లను ప్రజలకు తెలియజేస్తామన్నారు. బుధవారం నుంచి ఎరుపు రంగు రేషన్‌కార్డు ఉన్న కుటుంబంలోని అందరికీ 15 కిలోల చొప్పున బియ్యాన్ని ఇంటింటికీ తిరిగి అందిస్తామన్నారు. పసుపు రంగు రేషన్ కార్డుదారులకు ఏవిధంగా ఇవ్వాలనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. చెక్ పోస్టుల వద్ద పరిస్థితులను ఆయన పరిశీలించారు.

ANDHRA PRABHA

15 APR 2020 15 APR 2020

# నేటి నుంచి వేట నిషేధం

**యానాం, ప్రభన్యూస్ :**

కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నియోజకవర్గంలో బుధవారం నుండి జూన్ 14 వరకు చేపల వేట నిషేదించినట్లు పరిపాలనాధికారి శివరాజ్ మీనా తెలిపారు స్థానిక మత్స్యకారులు వేట నిషేధ సమయంలో వేటకు వెళ్లరాదని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్య తీసుకోబడుతుంది అని అన్నారు.

ENADU

15 APR 2020

# కేంద్రం ఆదుకోవాలి

**యానాం వాసుల వినతి**

యానాం, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారిని ఎదుర్కోవడానికి రాష్ట్రాలు, దేశాలు సమైక్యంగా పోరాడుతుంటే పుదుచ్చేరి ప్రభుత్వం మాత్రం నిధుల కొరతతో విలవిల్లాడుతోంది. కరోనా పాజిటివ్ కేసులొస్తే చికిత్స చేసేందుకు తగిన వైద్య సదుపాయాలు అందుబాటులో లేక, రాజధానికి 850 కిలోమీటర్ల దూరాన ఉన్న యానాం ప్రజలు అభద్రతాభావానికి గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా రూ.3.08 కోట్లు, ప్రకృతి వైపరీత్య నిధుల నుంచి రూ.2 కోట్లు ఖర్చుచేసేందుకు అనుమతిచ్చింది. 70 వేల జనాభా ఉన్న యానాం నియోజకవర్గానికి ఒకే ఒక్క వెంటిలేటరు, కొంత చికిత్సా సామగ్రి మంజూరయ్యాయి. లాక్‌డౌన్‌ను పెంచిన కేంద్రం ఆ మేరకు సాయం అందివ్వాలంటూ ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. పుదుచ్చేరిని ఆర్థికంగా ఆదుకోవడంలో కేంద్రం చిన్నచూపు చూస్తోందని, ఇక్కడి ప్రజలంతా యావద్దేశం దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లాలని యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రధాన కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు సూచించారు. మంగళవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఆర్థిక వృద్ధిరేటు గణనీయంగా పడిపోతున్నందున పరిశ్రమల్ని ఆదుకోడానికి మరిన్ని ఉద్దీపన చర్యల్ని కేంద్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

15 APR 2020

PRAJA SAKTHI

# యానాంలో పోలీసుల అత్యుత్సాహం

## అంబేద్కర్‌కు నివాళి అడ్డగింత

**ప్రజాశక్తి-యానాం**

యానాంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించకుండా పోలీసులు అడ్డగించారు. భౌతిక దూరం పాటించి అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తామన్న ప్రజా సంఘాల నేతలపై పోలీసులు విరుచుకు పడ్డారు. యానాంలో ఉన్న ప్రతి అంబేద్కర్ విగ్రహం వద్దా పోలీసులను కాపలా పెట్టి పూలదండలు వేయకుండా అడ్డుకున్నారు. భౌతిక దూరం పాటించి కనీసం ఇద్దరు వెళ్లి దండలు వేస్తామని చెప్పినా అంగీకరించలేదని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలిపారు. రమాబాయ్ నగర్ బుద్ధ పార్క్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వేసిన దండలు తీసివేయించారు. ఈ సందర్భంగా ఎస్‌పి, పోలీసులు లాఠీలతో కొట్టబోయారని ప్రసాద్ తెలిపారు. భౌతిక దూరం పాటిస్తూ నివాళి అర్పిస్తుంటే పోలీసులు ఎందుకు హడావిడి చేస్తున్నారని రాజ్యాంగ పరిరక్షణ వేదిక సలహాదారులు పొనుగుమట్ల విష్ణుమూర్తి, దుర్గాప్రసాద్, కుటుంబరావు, ప్రహ్లాదుడు, రాజేంద్రప్రసాద్ ఎస్‌పిని నిలదీశారు. యానాం టాక్సీ స్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు సిఐటియు నాయకులు జి.దుర్గాప్రసాద్, కొలంక శ్రీను, గూడ్స్ ఆటో యూనియన్ నాయకులు వై.శ్రీను, సత్యనారాయణ సిద్ధపడగా ఎస్ఐ కట్టా సుబ్బరాజు అడ్డుకున్నారు. ఎస్‌పి నుంచి అనుమతి తెచ్చుకోవాలని ఎస్ఐ చెప్పడంతో ఆవేదనతో వెనుదిరిగినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పెట్టా హరి, మట్టా శ్రీను, నామాడి అప్పారావు, బాబ్జి, కోరుకొండ ప్రసాద్ ఉన్నారు.

యానాంలో పరిపాలనాధికారి శివరాజ్ మీనా, ఇతర అధికారులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు, దళిత నాయకులు పూలమాలలు వేశారు.